ఆలయానికి ఆదాయం

- పోలమాంబ ఆలయ కల్యాణ మండపానికి ఇటీవల వేలం పాట
- రూ.46.65 లక్షలకు ఖరారు
- గతేడాది కంటే రూ.8.85 లక్షలు అధికం


పోలమాంబ ఆలయ కల్యాణ మండపం


భోజనాలకు అనువుగా ఉన్న విశాల స్థలం

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులోని పోలమాంబ ఆలయానికి ఆదాయ వనరుగా కల్యాణ మండపం నిలుస్తోంది. ఈ ఏడాది వేలం పాటలో భారీ ఆదాయం సమకూరింది. రెండు సంవత్సరాల కాలానికి ఈ నెల 21న వేలం నిర్వహించగా.. అక్కయ్యపాలేనికి చెందిన సింహాద్రి రూ.46.65 లక్షలకు దక్కించుకున్నారు. జూలై 1 నుంచి కొత్త కాంట్రాక్టర్ కల్యాణ మండపం నిర్వహణ బాధ్యతలు తీసుకోనున్నారు. గతంలో కంటే దాదాపు రూ.8.85 లక్షల ఆదాయం కల్యాణ మండపం వేలంపాట ద్వారా అధికంగా వచ్చింది.

నగరంలో 14 గ్రామాలకు ఇలవేల్పుగా కొలిచే పోలమాంబ ఆలయం నగరం మధ్యలో ఉంది. ఆలయాన్ని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో కల్యాణ మండపం నిర్మించి అభివృద్ధి చేసారు. దీంతో పాటు ఆలయం ఆనుకుని రోడ్డుపై ఆరు వాణిజ్య దుకాణాలను సైతం నిర్మించారు. వీటితో ఆలయానికి ప్రతీ సంవత్సరం భారీగా ఆదాయం సమకూరుతోంది. ఆరు షాపుల్లో ఒకటి కోర్టు వివాదంలో ఉండగా.. మిగతా 5 దుకాణాలు నిర్వహణలో ఉన్నాయి. వీటి నుంచి ప్రతి నెలా రూ.75,500 ఆదాయం లభిస్తోంది. ప్రస్తుతం దుకాణాలు, కల్యాణ మండపం నుంచి ఆలయానికి అర కోటికి పైగా ఆదాయం వస్తోంది. వివాదంలో ఉన్న దుకాణాన్ని సైతం స్వాధీనం చేసుకుని అద్దెకు ఇవ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

మండపం వేలానికి విశేష స్పందన

ఆలయాన్ని ఆనుకుని సమీప గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా రెండు అంతస్తుల్లో కల్యాణ మండపం నిర్మించారు. ఒక్కో అంతస్తులో విశాలమైన హాలు, రెండేసి గదులు ఉన్నాయి. దీనికి ఆనుకుని విశాలమైన ఖాళీ స్థలం, భోజనాలు ఏర్పాటు చేసుకోవడానికి అనువుగా ఆరుబయట పెద్ద షెడ్, వంటకు ప్రత్యేక షెడ్, స్టోర్ రూం వంటివి నిర్మించారు. రెండు సంవత్సరాల క్రితం దీనికి వేలం వేయగా రూ.37.80 లక్షలకు పాడుకున్నారు. తాజాగా ఇటీవల నిర్వహించిన వేలం పాటలో రూ.45.65 లక్షలకు ఈ–వేలంలో నగరానికి చెందిన సింహాద్రి దక్కించుకున్నారు. దీంతో ఈ సంవత్సరం వేలం పాటలో అదనంగా రూ.8.85 లక్షలు ఆదాయం ఆలయానికి సమకూరింది. మొదటి ఏడాది కంటే 10 శాతం అదనంగా రెండో సంవత్సరం అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో వచ్చే సంవత్సరం రూ.50.21 లక్షలు అద్దె రూపంలో ఆలయానికి లభించనుంది.

ఒకటి నుంచి నిర్వహణ బాధ్యతలు

ప్రస్తుతం ఉన్న పాటదారుడి కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి కొత్త కాంట్రాక్టర్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు వారు మండపం నిర్వహణ చేపట్టనున్నారు.

అందరికీ అందుబాటులో అద్దెలు

కల్యాణ మండపం అందరికీ అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఆలయ నిర్వాహకులు ముందుగానే అద్దెలు సైతం నిర్ణయించారు. నాన్ ఏసీ మండపం రూ.25 వేలు, ఏసీ మండపం రూ.30 వేలు చొప్పున రోజుకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా 18 శాతం జీఎస్టీ ఉంటుంది. శుభకార్యాలకు అవసరమైన కుర్చీలు, ఇతర అలంకరణ సామగ్రి వంటివి వేలంపాట పాడిన కాంట్రాక్టర్ వద్ద నుంచి పొందాల్సిన ఉంటుంది. వీటికి అదనపు రుసుం చెల్లించాలి.

క్లుప్తంగా

ఘనంగా పైడిమాంబ జాతర


పైడిమాంబకు పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దీన్‌దయాల్ పురంలో పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనుండడంతో బుధవారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ సబ్‌స్టేషన్ విశాలాక్షినగర్‌కు సంబంధించిన జూపార్కు 11 కేవీ ఫీడర్, ఎల్‌టీ లైన్‌లో మరమ్మతులు జరగనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

చెత్త పన్ను వసూళ్లు ఆపాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ప్రజల నుంచి చెత్త పన్ను వసూళ్లను తక్షణమే ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఠాపురం కాలనీ లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గంగారావు, ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడా రు. ఆస్తి పన్నులోనే చెత్త పన్ను ఉందని, అయినా చెత్తకు ప్రత్యేకంగా పన్ను వసూళ్ల చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రజాభిప్రాయం సేకరించాలన్నారు. చెత్త పన్నుపై కోర్టులో కేసు వేశామని వారు తెలిపారు. చెత్త పన్ను వసూలుపై వచ్చేనెల 4వ తేదీ నుంచి ప్రత్యేక కార్యచరణ రూపొందించనున్నామన్నారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా డాక్టర్ అచ్యుతరావు


డాక్టర్ అచ్యుతరావు

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా కేజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.అచ్యుతరావు తిరిగి నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన డాక్టర్ అచ్యుతరావు వైద్య సేవల్లో మూడు జిల్లాల్లో పేరు పొందారు. గతంలో ఒకసారి ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు. నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు, వైద్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాధ్యతాయుతమైన కౌన్సిల్ సభ్యునిగా తనను నియమించడం పట్ల డాక్టర్ అచ్యుతరావు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివరెడ్డి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

1న 'నాన్న నీ మనసే వెన్న' కార్యక్రమం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: వాత్సల్య బాంధవ్యంగా నాన్న నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. తన్మయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న ×నాన్న నీ మనసే వెన్న× కార్యక్రమం పోస్టర్‌ను వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఫాదర్స్ డేను పురస్కరించుకుని 143 మంది అతిథులు నాన్న గురించి మాట్లాడేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా నమోదు చేస్తారని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బి.ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి సి.హెచ్.వి.సత్యనారాయణ, కార్యక్రమ సమన్వయకర్తలు బాదంగీర్ సాయి, ఎన్.నాగేశ్వరరావు, సభ్యులు ఎం.వి.రాజశేఖర్, కె.రాజు, ఎం.హరిమోహన్, జి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న రంగసాయి నాటక గ్రంథాలయంలో 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెలలో అమృతమయి అమ్మ పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది.

ఫుట్‌పాత్‌పై నిర్మాణాల తొలగింపు


ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

ఎంవీపీ కాలనీ: అప్పుఘర్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆనుకొని ఉన్న అనధికారిక నిర్మాణాలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. త్వరలో గిరి ప్రదక్షిణ జరగనున్న నేపథ్యంలో భక్తుల నడకకు ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు అప్పుఘర్ నుంచి వెంకోజీపాలెం వైపు వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌పైన, దానిని ఆనుకొని ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ డీసీపీ నరేంద్ర, ఏసీపీ శాస్త్రీ, టీపీవో తేజ, టీపీఎస్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ పండగ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈవో త్రినాథరావు


బంగారమ్మతల్లి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ప్రియాగార్డెన్స్‌లో ఉన్న అమ్మవారి ఆలయానికి అడవివరం గ్రామస్తులు, భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గ్రామ సాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత అడవివరంలో ఉన్న శతకంపట్టు వద్ద నుంచి అమ్మవారి పూజారి వంశీయులైన లండ కుటుంబ సభ్యులు ఘటాలను శిరస్సుపై పెట్టుకుని ప్రియాగార్డెన్స్‌లో ఉన్న ఆలయానికి చేరుకున్నారు. దారి పొడవునా అమ్మవారికి గ్రామస్తులు హారతులు, పసుపు కుంకుమలు సమర్పించారు. సింహాచలం దేవస్థానం తరఫున ఈవో వి.త్రినాథరావు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయం వద్ద దేవస్థానం తరఫున భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

'మేరా బూత్–సబ్ సే మజ్ బూత్' వీక్షణ


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: ప్రధాని మోదీ చేపట్టిన మేరా బూత్ – సబ్ సే మజ్ బూత్(నా పోలింగ్ బూత్ అన్నిటికన్నా బలమైనది) కార్యక్రమం మంగళవారం దేశ వ్యాప్తంగా జరిగింది. బీజేపీ శ్రేణులతో ప్రధాని ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఇందులో భాగంగా మోదీ ప్రసంగాన్ని జిల్లా బీజేపీ శ్రేణులు మంగళవారం ఆరిలోవలో జరిగిన ఓ కార్యక్రమంలో వీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 10 లక్షల పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని కార్యకర్తలను ప్రోత్సహించడంతో పాటు సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు.

పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం


సంతపాలెం పాఠశాలలో సమావేశమైన కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి ప్రాంతం సంతపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చూడడం, వంద శాతం విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజనం, రాగి జావ సక్రమంగా పంపిణీ జరిగేటట్టు చర్యలు తీసుకోవడంపై చర్చించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ జరిగే సమావేశాలకు హాజరై పాఠశాల అభివృద్ధికి సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ చైర్‌పర్సన్ కె.విజయలక్ష్మి, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన గొరుసు సత్యవతి (32) అనే మహిళ మంగళవారం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మృతి చెందింది. సత్యవతి తగరపువలసలో నివసిస్తూ పాల వ్యాపారం చేస్తుండగా భర్త అప్పలరెడ్డి ముఠా పనులు నిర్వహిస్తూ ఉంటాడు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. అమనాం సచివాలయానికి సత్యవతి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విజయనగరం జిల్లా డెంకాడ మండలం లింగాలవలస వద్ద ప్రమాదానికి గురయింది. దీంతో వెనుక నుంచి భారీ వాహనం ఈమె నడుము పైనుంచి వెళ్లిపోగా తీవ్ర గాయాల పాలయింది. స్థానికులు ఆమెను చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని సుందరపేట పీహెచ్‌సీకి తరలించారు. డెంకాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ విరమించే వరకు ఉద్యమం


శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగుతుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 866వ రోజు మంగళవారం పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కార్మిక వర్గం ఎన్నో ఏళ్లుగా శ్రమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

ఆస్పత్రి గోడలపై అద్భుత చిత్రాలు


సమావేశ మందిరం బయట శాస్త్రవేత్తల చిత్రాలు


వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో కురుసుర సబ్‌మెరైన్ చిత్రం


చిన్నారుల వార్డు వద్ద ఆకర్షణీయంగా చిత్రాలు


ఆస్పత్రి గోడపై లైట్‌హౌస్ బొమ్మ

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ ఆస్పత్రులు అనగానే ప్రజల్లో ఒక చిన్నచూపు ఉండడం సర్వసాధారణం. దీనికి భిన్నంగా ఆస్పత్రి పరిసరాలు, ప్రాంగణం చూడగానే ఆహ్లాదకర వాతావరణం దర్శనమిస్తే ఎంత బాగుంటుంది. ఇందుకు నిదర్శనంగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి ప్రాంగణం నిలుస్తోంది. ఆస్పత్రి పరిసరాలను ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆస్పత్రి గోడలపై అందమైన చిత్రాలు వేయించారు. చిన్నారుల వార్డుకు వెళ్లే మార్గంలో గోడలపై ప్రకృతి మధ్యలో ఆడుకుంటున్న పిల్లల బొమ్మలు గీయించారు. ఇవి చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. చికిత్స కోసం వచ్చే చిన్నారులకు మంచి ఆహ్లాదాన్ని కలిగించేలా, ఆస్పత్రికి వచ్చామనే భావన కలగకుండా ఈ చిత్రాలు దోహదపడుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా విశాఖ ప్రాముఖ్యతను తెలిపే లైట్ హౌస్, సబ్ మెరైన్ చిత్రాలను సైతం చిత్రకారులు అద్భుతంగా గీశారు. సమావేశ మందిరం వెలుపల శాస్త్రవేత్తల ఫొటోలు, లోపల మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు ఆస్పత్రి లోపల, వెలుపల పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం దర్శనమిస్తోంది. రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూర్చేలా ఆస్పత్రి పరిసరాలు తీర్చిదిద్దుతున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

గిరి ప్రదక్షిణ సజావుగా సాగేలా..


సుసర్ల కాలనీ వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు


కుమారి కల్యాణ మండపం ఎదురు రోడ్డులో సాగుతున్న పనులు

గోపాలపట్నం: ఈ నెల 2వ తేదీన జరిగే గిరి ప్రదక్షిణ సజావుగా సాగేలా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ అధికారులు రహదారుల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కుమారి కల్యాణ మండపం నుంచి సుసర్ల కాలనీ వరకు ఉన్న రహదారిపై ఆక్రమణలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు సంయుక్తంగా తొలగింపు చర్యలు చేపట్టారు. జోన్–8 ఏసీపీ జయరాం, టీపీవో ప్రేమ్‌కుమార్, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ పనులు బుధవారం కూడా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఏసీపీ జయరాం మాట్లాడుతూ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. గిరి ప్రదక్షిణలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

రంజింపజేసిన సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయనీగాయకులు

సీతంపేట: పాటే మా ప్రాణం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విశాఖపౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు ఎస్పీ బాలు, సంగీత దర్శకులు జేవీ రాఘవులు చిత్ర గీతాలు ఆలపించి అలరించారు. గాయకులు నాగులాపల్లి వెంకటేశ్వరరావు, మనుపల్లా వెంకటేష్, పద్మ ప్రియదర్శిని, బొమ్మిడి సత్యనారాయణ, మాధురి, జగదీష్ కుమార్, గౌరి, జయరావ్, జాస్మిన్, వీవీఎస్ మూర్తి, పూర్ణ తదితరులు సినీ గీతాలు మృదుమధురంగా ఆలపించి ప్రేక్షకులను రంజింపజేశారు.

కాన్వెంట్ జంక్షన్ పెట్రోల్ బంక్ వేలం 14న

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–5 (జ్ఞానాపురం) పరిధిలో గల కాన్వెంట్ జంక్షన్ పెట్రోల్ బంక్ (పాత ఐఓసీఎల్ బంకు) జూలై 14న జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన ప్రకారం పాట ఖరారు కాబడిన తర్వాత పాట మొత్తంలో నాల్గోవంతు సొమ్ము జీఎస్టీతో కలిపి ధరావత్తు పోగా మిగిలిన సొమ్ము జీఎస్టీతో కలిపి డీడీ ద్వారా/బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు జ్ఞానాపురం జోనల్ కార్యాలయ పర్యవేక్షణ పని దినాల్లో సంప్రదించాలని తెలిపారు.

మెషీన్ లెర్నింగ్‌పై ఎఫ్‌డీపీ

కొమ్మాది: మెషీన్ లెర్నింగ్‌పై అధ్యాపకులు, పరిశోధకులకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగాం (ఎఫ్‌డీపీ) మంగళవారం ప్రారంభమైంది. ఐఐటీ గౌహతితో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రొఫెసర్ డా. త్రివేది మాట్లాడుతూ వీఎల్ఎస్ఐ, కంప్యూటర్ రంగాల్లో మెషీన్ లెర్నింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు.